సాక్షి నిజామాబాద్

బుధవారం ; 27 ; డిసెంబర్ ; 2023



కబ్జా కోరల్లో శిఖం !

నిజామాబాద్ రూరల్ మండలం సారంగాపూర్, శాస్త్రినగర్ గ్రామాలను కలుపుకొని ఉన్న పెద్ద చెరువు శిఖం కబ్జాకు గురవుతోంది.

- 8లో ▸



హామీలకు కట్టుబడి ఉన్నాం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.2 /15.5

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

స్వేద పత్రం పేరుతో కేటీఆర్ డ్రామాలు

- మాజీ మంత్రి షబ్బీర్‌అలీ

ఖలీల్‌వాడి: స్వేద పత్రం పేరుతో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డ్రామాలు ఆడుతున్నారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. కేటీఆర్‌వి పిల్ల చేష్టలని అభివర్ణించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ వసతిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రంలో తప్పులు నిరూపించాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉన్న అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారమే శ్వేత పత్రం విడుదల చేసినట్లు తెలిపారు. శాసనసభలో శ్వేత పత్రం విడుదల చేసిన తర్వాత ఎలా తప్పులని చెబుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం విడుదల చేస్తారని తెలిపారు. దరఖాస్తులు స్వీకరించడానికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. మీసేవా సెంటర్లలో క్యూలో గంటల కొద్ది వేచి చూడాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన వారికి ఆధార్‌కార్డుతో పాటు తెల్లరేషన్ కార్డు ఉంటే చాలన్నారు.

జీవో 46 ప్రకారం కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇవ్వాలి

ఖలీల్‌వాడి: జీవో 46 ప్రకారమే కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇవ్వాలని.. కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన జిల్లాకు చెందిన అభ్యర్థులు జిల్లాకు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. జీవో 46 ప్రకారం అన్ని జిల్లాలకు సమన్యాయం జరిగిందన్నారు. 95శాతం టీఎస్‌ఎస్‌పీ ఉద్యోగాలు స్థానికులకే వచ్చాయని మంత్రికి వివరించారు. జీవో 46 లేకపోతే 5వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు రెండు లేదా మూడు జిల్లాలకే వచ్చేవన్నారు. 2022 తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్ నియామకం నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు మెడికల్ టెస్ట్‌లు నిర్వహించాలని కోరారు. టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్‌కు ఎంపికైన అభ్యర్థులను సివిల్, ఏఆర్ అభ్యర్థుల మాదిరిగానే కానిస్టేబుళ్లను శిక్షణకు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమలతో ఆర్థికంగా ఎదగాలి



నిజామాబాద్‌నాగారం: నిరుద్యోగ యువత పరిశ్రమల ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎదగాలని ఎంఎస్‌ఎంఈ డీఎఫ్‌వో రాజేశ్‌కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం నగరంలోని స్నేహ సొసైటీలో సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కూలీ పనిచేయడం ద్వారా తమ కుటుంబాల అవసరాలు తీర్చలేరని.. పేదవారిగానే మిగిలిపోతారన్నారు. ప్రభుత్వాలు చేసే ఆర్థిక సహాయంతో చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశ్వకర్మ, కమ్మరి, వడ్రంగి, నాయీబ్రాహ్మణ, మేస్త్రీలు, చాకలి తదితర వృత్తులకు గ్యారంటీ లేకుండా ఆర్థిక సహాయం చేస్తున్నట్లు వివరించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతి, ప్రోగ్రాం మేనేజర్ అహ్మద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి కాలువల ద్వారా యాసంగి పంటలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వారా 50, గుత్ప లిఫ్టు ద్వారా 270, అలీసాగర్ లిఫ్టు ద్వారా 180, ఆవిరి రూపంలో 398 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగుల కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1087.60(75.15 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

6 గ్యారంటీలకు ప్రజాపాలన

ప్రతి ఇంటికి దరఖాస్తు ఫారం

ఆరు గ్యారంటీల అమలు కోసం దరఖాస్తు ఫారాలను ప్రతి గ్రామంలో, వార్డులో ప్రతి ఇంటికి ఒక రోజు ముందుగానే అందజేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఏ పథకానికి అర్హత ఉంటే ఆ పథకానికి దరఖాస్తులో రాయాలన్నారు. గ్రామం, వార్డు, మున్సిపాలిటీల్లో ఎవరెవరితో ప్రజాపాలన సభలు నిర్వహిస్తారనే ఫార్మాట్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రెండు గ్యారంటీల అమలు ప్రారంభమైందన్నారు. మిగిలిన గ్యారంటీల అమలు కోసం ప్రణాళికలను అమలు చేసేందుకు అధికారులను సమాయత్తం చేస్తున్నామన్నారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతిరెడ్డిలతో కలిసి మంత్రి విలేకరులతో మాట్లాడారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పాల్గొన్న ఎమ్మెల్యేలు ధన్‌పాల్, కేవీఆర్, రాకేశ్‌రెడ్డి, భూపతిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ విఠల్‌రావు, ఎంపీ సురేశ్‌రెడ్డి, మేయర్ నీతూకిరణ్, ఎంపీ అర్వింద్

- ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు గ్రామ, వార్డు సభలు
- బడుగు, బలహీన వర్గాల ఆర్థిక ప్రగతికి తోడ్పాటు
- అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలి
- ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలనపై సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన అమలుపై నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధికారులతో మంత్రి జూపల్లి సన్నాహక సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేయడంలో భాగంగా క్షేత్రస్థాయిలో దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు అమలు చేయనున్న గ్రామ, వార్డు సభల ప్రణాళిక విషయమై యంత్రాంగానికి మంత్రి మార్గనిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ.. దశాబ్దాల పాటు పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఎంతోమంది తమ సమస్యలు పరిష్కారమవుతాయని, కష్టాలు తీరుతాయని ఆశతో ఉన్నారన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు, వారి సమస్యలను తీర్చి, బడు గు, బలహీన వర్గాల ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించిందన్నారు. అధికారులు మొక్కుబడిగా కాకుండా జవాబుదారీతనంతో అత్యంత పారదర్శకంగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి పేదవాడికి న్యాయం జరగాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. ఆరు గ్యారంటీలకు సంబంధించి అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరుగకుండా చూడాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమం గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ప్రజలందరికి అవగాహన కల్పించాలన్నారు. మరింత అవగాహన కల్పించేలా ప్రజాప్రతినిధులు, మీడియా, సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలన్నారు. యువత కూడా తమవంతు చొరవ చూపాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు మహాలక్ష్మి, రైతు భరోసా, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఎటువంటి ఫిర్యాదు లు, అవకతవకలకు తావులేకుండా ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సంపూర్ణ సమాచారాన్ని సేకరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, తద్వారా అర్హులకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, యువత ఇలా అన్ని వర్గాల వారికి మేలు చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో తొక్కిసలాటలు, రద్దీ వంటి వాటికి ఆస్కారం లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ భాగస్వామ్యంతో ప్రజాపాలన సభలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సానుకూల దృక్పథంతో, ప్రజలను సంతృప్తిపరిచే రీతిలో ఈ కార్యక్రమం కొనసాగాలన్నారు. రాజ్యసభ్య సభ్యుడు సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ కోవి డ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ వికసిత్ భారత్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పాలు పంచుకుని ప్రజలకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజా పాలన అమలు కోసం చేపట్టిన చర్యల గురించి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అదనపు కలెక్టర్లు చిత్రా మిశ్రా, యాదిరెడ్డి, మనూ చౌదరి వివరించారు. సమావేశంలో నిజామాబాద్ జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మేయర్ నీతూకిరణ్, బోధన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి ఎమ్మెల్యేలు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, ఆర్ భూపతిరెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా అధికారులు

అక్రమ మైనింగ్‌ను ఉపేక్షించేది లేదు

- సమగ్ర నివేదిక అందించాలని అధికారులకు మంత్రి ఆదేశం

అక్రమ మైనింగ్‌ను ఉపేక్షించేది లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. 'ప్రజాపాలన'పై సమీక్ష సందర్భంగా మంత్రి అక్రమ మైనింగ్ అంశాన్ని ప్రస్తావించి సీరియస్ అయ్యారు. సమీక్ష కోసం తాను నిజామాబాద్‌కు వస్తున్న సందర్భంగా కామారెడ్డిలో పలువురు బాధితులు తనను కలిసి పాల్వంచ మండలం మంథని, దేవునిపల్లిలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేశారన్నారు. భారీపేలుళ్ల కారణంగా వందల బోరుబావులు, ఇళ్లు దెబ్బతిన్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. రెండేళ్లుగా అక్రమ మైనింగ్, బ్లాస్టింగ్స్ జరుగుతున్నా ఎందుకు చర్యలు చేపట్టలేదని సంబంధిత అధికారులను నిలదీశారు. తక్షణమే విచారణ చేసి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నష్టపోయిన బాధితులకు మైనింగ్ యాజమాన్యం ద్వారా నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్మూర్‌లో కేజీఎఫ్ మాదిరిగా..

ఆర్మూర్ నియోజకవర్గంలో పదేళ్ల కాలంలో కేజీఎఫ్ మాదిరిగా అక్రమంగా మైనింగ్ చేసి మాజీ ఎమ్మెల్యే రూ.వేల కోట్లు దండుకున్నాడని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మంత్రికి ఫిర్యాదు చేశారు. అక్రమ తవ్వకాలపై తాను సదరు క్వారీలను సందర్శించిన సమయంలో తనకు అంతర్జాతీయ కాల్స్ ద్వారా మాజీ ఎమ్మెల్యే నుంచి బెదిరింపులు వచ్చాయని తెలిపారు. ఈ అక్రమ మైనింగ్‌పై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కోరారు. స్పందించిన మంత్రి ఆర్మూర్ నియోజకవర్గంలో మైనింగ్ విషయమై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

'జీరో బడ్జెట్ పాలిటిక్స్'ను ప్రోత్సహించాలి

- పసుపు ధరను రూ.20 వేలు దాటిస్తాం
- కాంగ్రెస్ శ్వేతపత్రంతో ప్రజల్లో కన్‌ఫ్యూజన్
- ప్రధాని మోదీ నిజామాబాద్ నుంచి పోటీ చేస్తే ధన్యవాద యాత్ర చేస్తా..
- ఎంపీ అర్వింద్ ధర్మపురి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, పాల్గొన్న నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు

సుభాష్‌నగర్: ఎన్నికలంటే డబ్బుతో ముడిపడిపోయాయని, జీరో బడ్జెట్ పాలిటిక్స్‌ను ప్రోత్సహించాల్సిన బాధ్యత మేధావులపై ఉందని ఎంపీ అర్వింద్ ధర్మపురి పిలుపునిచ్చారు. డబ్బుల పంపిణీకి స్వస్తి పలకాలనే ఉద్దేశంతో కోరుట్లలో తాను నూతన ఒరవడికి శ్రీకారం చుట్టానన్నారు. డబ్బు పంచకపోయినా ప్రజలు తనకు 62వేల మంది ఓట్లు వేశారని, వారికి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉత్తర భారతంలో అసెంబ్లీ ఎన్నికల్లో రూ.40 లక్షల్లోపే ఖర్చు చేస్తారని, అందుకే అక్కడ కమీషన్లు ఉండవన్నారు. దక్షిణ భారతంలోనే ఖర్చు అధికంగా ఉంటుందని, కమీషన్లు, అవినీతి, అక్రమ సంపాదనకు తెరలేపుతున్నారన్నారు. ఐదేళ్లలో అసాధ్యం అనుకున్న పసుపు బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, మరో ఐదేళ్లలో పసుపు ధరను రూ.20 వేలు దాటించే బాధ్యత తనదన్నారు. ప్రధాని మోదీ నిజామాబాద్ పార్లమెంట్‌కు పోటీ చేస్తారన్న విలేకరుల ప్రశ్నకు అంతకంటే అదృష్టం ఏముందని, ఆయన పోటీ చేస్తే ధన్యవాద యాత్ర చేపడతానని సమాధానమిచ్చారు.

ప్రభుత్వానికి సహకరిస్తాం..

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి సహకరిస్తామని ఎంపీ పేర్కొన్నారు. వాగ్దానాలు, గ్యారంటీలను అమలు చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేసి ప్రజలను కన్‌ఫ్యూజన్‌లో పెట్టిందన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడి మార్పు తెలియదన్నారు. కార్పొరేటర్లకు బీజేపీలో ఉంటేనే గెలుస్తామని జ్ఞానోదయమై తిరిగి పార్టీలోకి వస్తున్నారన్నారు. చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు నిజాయితీగా పని చేయాలని, త్వరలోనే నగరాభివృద్ధిపై సమీక్షిస్తానన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓడిన కాంగ్రెస్ అభ్యర్థులే ప్రజలకు అందిస్తారని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనన్నారు. గత ప్రభుత్వ అవినీతిపరులకు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు సహకరిస్తున్నారని, నాయకులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నాయకులు దినేశ్ కులాచారి, న్యాలం రాజు, పంచరెడ్డి లింగం, బీఆర్ శివప్రసాద్, నాగోళ్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు దీటుగా ఓట్లు..

నిజామాబాద్ ఎంపీ స్థానం పరిధిలోని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు దీటుగా అసెంబ్లీ ఎన్నికల్లో 3.67 లక్షల మంది(30 శాతం) ఓట్లు బీజేపీకి వచ్చాయని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. ఎక్కడా డిపాజిట్ కోల్పోలేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 350 నుంచి 403 మంది బీజేపీ అభ్యర్థులు గెలుస్తారని సర్వేలు చెప్తున్నాయన్నారు. ఎంపీగా బరిలో ఉండి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

వివాదంలో మాజీ ఎమ్మెల్యే కుటుంబం

బోధన్: బోధన్ మాజీ ఎమ్మెల్యే కుటుంబం మరోసారి వివాదంలోకి చిక్కింది. షకీల్ తనయుడు రహీల్ ఆమేర్ తన కారును అతివేగంగా నడుపుతూ హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద బారికేడ్లను ఢీకొట్టినట్లు మంగళవారం వచ్చిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఘటన నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై హైదరాబాద్ పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు సమాచారం. గతంలో హైదరాబాద్‌లోనే రహీల్ ఆమేర్ కారు ఢీకొన్న ఘటనలో పసిబాలుడు మృతి చెందాడు. అలాగే బోధన్ పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద షకీల్ సతీమణి అయేషా ఫాతిమా కారు ఢీకొన్న ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ విషయంలో పోలీసులు కేసు నమోదు చేశారు. తాజా ఘటనతో మాజీ ఎమ్మెల్యే కుటుంబం మరోసారి వివాదంలోకి చిక్కింది. తన కుటుంబీకులు రోడ్డు ప్రమాద ఘటనల్లో తెరపైకి రావడం మాజీ ఎమ్మెల్యేకు ఇబ్బందికరంగానే మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఖతర్‌లో ఉపాధికి ఉచిత వీసాలు

- కొత్త ఏడాదిలో వలస కార్మికులకు కంపాస్ కంపెనీ ఇంటర్వ్యూలు
- నిజామాబాద్‌లో జనవరి 5న నిర్వహణ

మోర్తాడ్(బాల్కొండ): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఉపాధి కల్పించడానికి పలుమార్లు ఉచిత వీసాలను జారీ చేసిన కంపాస్ కంపెనీ అదే తరహాలో ఖతార్‌లో ఉపాధి కల్పించడానికి ముందుకు వచ్చింది. కొత్త ఏడాదిలో నిజామాబాద్‌లో ఇంటర్వ్యూలను నిర్వహించి తమ కంపెనీలో పనిచేసేందుకు అర్హులైన కార్మికులను ఎంపిక చేయడానికి ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. తెలంగాణలోని ప్రముఖ కన్సల్టెన్సీ జీటీఎం సంస్థ ఆధ్వర్యంలో జనవరి 5న నిజామాబాద్‌లో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. 21 ఏళ్ల వయస్సు నిండి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు ఇంగ్లిష్ భాషలో పరిజ్ఞానం కలిగి ఉండాలి. ఈసీఎన్‌ఆర్ పాస్‌పోర్టుతో పాటు ఎలాంటి పచ్చబొట్టు లేని యువకులకు ఉచిత వీసాలను జారీ చేయనున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జీటీఎం కన్సల్టెన్సీ కార్యాలయాల్లో తమ వివరాలను నమోదు చేయించుకోవాలి. ఎవరికీ ఒరిజినల్ పాస్‌పోర్టులు, డబ్బులు ఇవ్వకూడదని జీటీఎం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చీటీ సతీశ్‌రావు వెల్లడించారు. అభ్యర్థులు ఆర్మూర్, నిజామాబాద్, జగిత్యాల్, హైదరాబాద్‌లలో ఉన్న తమ కన్సల్టెన్సీ కార్యాలయాల్లో బయోడేటా అందించి ఇంటర్వ్యూకు హాజరు కావడానికి టోకెన్, లోకేషన్ వివరాలను తీసుకోవాలని ఆయన సూచించారు. ఉచిత వీసాల ప్రక్రియ గతంలోనూ కొనసాగగా అనేక మందికి యూఏఈ, ఖతార్‌లలో ఉపాధి కల్పించారు. ఇప్పుడు కూడా కేటరింగ్ సపోర్టు సర్వీసులలో ఉపాధి కల్పించడానికి ఉచిత వీసాలను జారీ చేయనున్నట్లు ఆయన వివరించారు.

దండిగా రుణాలు.. కడుపునిండా పని

- మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట
- పల్లె పేదలకు ఉపాధినిచ్చిన 2023 సంవత్సరం
- గ్రామీణాభివృద్ధి పథకాలు సంతృప్తికరం



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఈ ఏడాదిలో మహిళల ఆర్థికాభివృద్ధికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల తో పాటు 'ఉపాధిహామీ' పథకంతో గ్రామాల్లోని పేదలకు ఉపాధి లభించింది. సీసీ రోడ్లతో వాడల్లో రోడ్లు మెరుగయ్యాయి. హరితహారంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటారు. అర్హులైన కొంతమందికి 'ఆసరా' పింఛన్లు మంజూరయ్యాయి. ఏళ్లుగా ఎదురు చూస్తున్న రుణాల వడ్డీ వాపస్ ఇదే ఏడాదిలో జరిగింది. మొత్తం మీద గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు 2023లో సంతృప్తికరంగా ఉన్నాయి.



సమావేశమైన ఎస్‌హెచ్‌జీ మహిళలు (ఫైల్)

- పీఎంఎఫ్‌ఎంసీ పథకం ద్వారా 129 యూనిట్లు గ్రౌండింగ్ కాగా, పిండి, కారం, పసుపు, పప్పుల గిర్నిలు ఏర్పాటయ్యాయి. పసుపు ఉడకబెట్టే యంత్రాలతో పాటు ఇతర మిషనరీని మహిళా సంఘాల సభ్యులు కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్నారు.
- ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న వడ్డీ వాపస్ కూడా ఇదే ఏడాది వచ్చింది. 2018, 2019, 2020 సంవత్సరాలకు సంబంధించిన రూ. 71.96 కోట్ల వడ్డీని మహిళల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.
- స్త్రీనిధిలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి రుణాలు అందించినందుకు ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్రస్థాయి అవార్డును డీఆర్‌డీవో చందర్ నాయక్ అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.

రివైండ్ 2023

- 2023లో కొంతమందికే కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. టేకెదార్లు, వృద్ధాప్య పింఛన్లు క లిపి మొత్తం 4,500 జిల్లాకు మంజూరయ్యాయి. మిగతా ఏ కేటగిరీల వారీగా పింఛన్లు రాకపోవడంతో 2023 నిరాశపర్చింది.
- ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది లక్ష్యానికి మించి 41.22 లక్షల పనిదినాలను (101.1 శాతం) గ్రామాల్లోని పేదలకు కల్పించారు. ఇందుకు గాను రూ.66.52 కోట్ల ఉపాధి కూలీలకు లభించింది.
- మహిళా సంఘాల ద్వారా ఈ ఏడాది వాన కాలం సీజన్‌లో 4.73 లక్షల క్వింటాళ్ల వడ్లు కొ నుగోలు చేసి రూ.104 కోట్ల వ్యాపారం చేశారు. యాసంగిలో 5.43 లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేసి రూ.111.53 కోట్ల వ్యాపారం చేశారు.
- ఈ ఏడాది బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ. 1,032 కోట్లు ఉండగా, ఇప్పటి వరకు 11,677 మహిళా సంఘాలకు వివిధ అవసరాల నిమిత్తం రూ.829.82కోట్లు అందజేశారు. అదే విధంగా స్త్రీనిధి రుణాలు రూ.239 కోట్ల లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 50 శాతం మేర అందించారు.



గుంతలు తవ్వుతున్న కూలీలు

క్లుప్తంగా

ఖోఖోలో నేషనల్ చాంపియన్‌గా తెలంగాణ జట్టు



ఎల్లారెడ్డిరూరల్‌: ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం నిర్వహించిన అండర్‌–18 జూనియర్‌ ఖోఖో విభాగంలో తెలంగాణ బాల, బాలికల జట్లు నేషనల్‌ చాంపియన్‌ సాధించినట్లు తెలంగాణ ఖోఖో జాయింట్‌ సెక్రటరీ అతీకుల్లా తెలిపారు. ఈ జట్టులో ఎల్లారెడ్డి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి గౌతమ్‌ ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పెర్కిట్‌: ఆర్మూర్‌ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన పుట్టింటి నవీన జాతీయ స్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపికైనట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీ మధు మంగళవారం తెలిపారు. నవీన హైదరాబాద్‌లో బీటెక్‌ మొదటి సంవత్సరం చదువుతోంది. తిరుపతిలో 27 నుంచి 30వరకు నిర్వహించే సౌత్‌ జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ జాతీయ స్థాయి వాలీబాల్‌ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నవీనను వాలీబాల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హన్మంతరెడ్డి, మల్లేశ్‌గౌడ్‌, పీఈటీలు మధు, పవన్‌, భూపతి, రాజేశ్‌, యాదగిరి, శ్రీనివాస్‌, సురేశ్‌ అభినందించారు.

హామీలకు కట్టుబడి ఉన్నాం



ధర్పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కాంగ్రెస్‌ పార్టీ కట్టుబడి ఉందని రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని రామడుగు ప్రాజెక్ట్‌ నుంచి కుడి, ఎడమ కాలువ ద్వారా యాసంగి పంటలకు ఆయకట్టు రైతులకు అందించే నీటిని మంగళవారం విడుదల చేశారు. ముందుగా ప్రాజెక్టు కట్టపై ఉన్న మైసమ్మ తల్లి ఆలయంలో పూజలు చేపట్టారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకున్న గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పాలనలో రామడుగు ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్నారు. 2010లో నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి రూ.20 కోట్ల నిధులు కేటాయించడంతోనే ప్రాజెక్టు ఆయకట్టు పెంచి కట్ట బలోపేతం, కుడి ఎడమ కాలువల సీసీ లైన్‌తూంల నిర్మాణం జరిగిందన్నారు. రామడుగు ప్రాజెక్ట్‌ కాల్వలు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్‌ నీరడి పుష్ప, నాయకులు ఆర్మూర్‌ బాలరాజ్‌, మహేందర్‌, చెలిమెల నర్సయ్య, మిట్టపల్లి గంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో శిఖం భూములు!

- నూతనంగా వెలుస్తున్న వెంచర్లు
- లేఅవుట్ పర్మిషన్‌లతో ప్లాట్ల అమ్మకాలు
- పేద, మధ్యతరగతి వారే టార్గెట్‌



వెంచర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ (ఫైల్‌)



శాస్త్రినగర్‌ శివారులో శిఖం భూమిలో వెంచర్‌కు సంబంధించిన రాళ్లు పాతిన దృశ్యం

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ మండలంలోని సారంగపూర్‌, శాస్త్రినగర్‌ గ్రామాలను కలుపుకొని పెద్ద చెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతోంది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నాటి ప్రభుత్వాలు వ్యవసాయానికి ఆరుగాలం నీటి కష్టాలు రాకుండా ఉండేందుకు చెరువులు, కుంటలు, మాటు కాలువలు ఏర్పాటు చేశాయి. ఈ నేపథ్యంలో మండలంలోని సారంగపూర్‌, శాస్త్రినగర్‌ గ్రామాలను కలుపుకుని ఉన్న చెరువుల శిఖం భూములను కొందరు కబ్జా చేసి పేద, మధ్య తరగతి కుటుంబాలకు విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న 13వ డివిజన్‌ సారంగపూర్‌లో నాలుగు చెరువులు ఉన్నాయి. పెద్ద చెరువు, రాళ్లచెరువు, గూని గుంట చెరువు, నరసింహ చెరువు వీటి విస్తీర్ణం దాదాపు వందల ఎకరాల్లో ఉంటుంది. సారాంగపూర్‌, శాస్త్రినగర్‌ శివారులో జానకంపేట్‌ రైల్వే ట్రాక్‌ వద్ద గూడ్స్‌ రైళ్ల ద్వారా వచ్చే యూరియా ఇతర సామగ్రి పెద్ద డంపింగ్‌ యార్డ్‌ ఏర్పాటవుతుంది.

ఈ క్రమంలో అక్కడ ఉన్న భూములకు ఒక్కసారిగా రెక్కలు వచ్చేసి రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. ఇదే అదునుగా చూసుకొని కొందరు కబ్జాదారులు దాదాపు 16 ఎకరాల శిఖరం భూమిని కబ్జా చేసినట్లు సమాచారం. ఆ భూమిలో ఏకంగా 197 ప్లాట్లను ఏర్పాటు చేసి గజానికి రూ. 4 వేల నుంచి 5 వేల ద్వారా బ్రోకర్లతో అమ్మకాలు చేపడుతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

చెరువు శిఖం భూముల్లో అక్రమ వెంచర్ల విషయమై ఆయా గ్రామాల రైతులు, గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులు స్వీకరించిన ఆర్డీఓ రాజేందర్‌, తహసీల్దార్‌ అనురుద్‌, మున్సిపల్‌ కమిషనర్‌ మకరంద్‌తో సహా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

అధికారుల నిర్లక్ష్యం..

గత నెలలో నిర్వహించిన ఎన్నికల్లో అధికారులు బిజీగా ఉన్నట్లు గుర్తించిన సదరు భూకబ్జాదారులు అదే అదునుగా భావించి వెంచర్లను ఏర్పాటు చేశారు. చెరువు శిఖం భూములు మున్సిపల్‌ పరిధిలో ఉన్నందున ఇరిగేషన్‌, రెవెన్యూ, మున్సిపల్‌ అధికారులు సర్వే చేపట్టి అందులో ప్రభుత్వ భూమి, పట్టా భూమి ఎంత ఉందో నిర్ధారించాలి. అధికారుల సమన్వయ లోపాన్ని అలుసుగా తీసుకొని కబ్జాదారులు చెరువు శిఖం భూములను కబ్జా చేస్తూ ప్లాట్లుగా మారుస్తున్నారు. ఫలితంగా సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సారంగపూర్‌, శాస్త్రినగర్‌ శివారులో వెలిసిన వెంచర్‌లో 11 కేవీ విద్యుత్‌ లైన్లను సదరు కబ్జాదారులు తొలగించారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చెరువు శిఖం భూములు కబ్జాకు గురికాకుండా చూడాలని స్థానిక ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిని గుర్తిస్తాం



సారంగపూర్‌, శాస్త్రినగర్‌ గ్రామాలకుతానుకుని ఏర్పాటైన వెంచర్‌పై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. రెండు వారాల క్రితం ఆర్డీవో రాజేందర్‌, సిబ్బందితో కలిసి పరిశీలన చేపట్టాం. వెంచర్‌లో శిఖం భూమి ఉందని అనుమానం వ్యక్తం అవుతోంది. ఇరిగేషన్‌, మున్సిపల్‌, పంచాయతీ అధికారులు సర్వే చేపట్టి ప్రభుత్వ భూమి ఎంత ఉందో గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– అనురుద్‌, తహసీల్దార్‌

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్‌

- నిజామాబాద్‌ ఎంపీ అర్వింద్‌

నందిపేట్‌: గ్రామ ప్రజలు కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్‌ అన్నారు. నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్‌లో మంగళవారం నిర్వహించిన వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్రలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలకు అందే లక్ష్యంతో గ్రామగ్రామాన వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్ర నిర్వహిసుతన్నట్లు పేర్కొన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన క్యాలెండర్‌ను క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కొల్కొండ సాయన్న, సీనియర్‌ నాయకులు పల్లె గంగారెడ్డి, పాలెం రాజు, మారంపల్లి గంగాధర్‌, నాగసురేశ్‌, ఎంపీటీసీ గోదావరి ప్రవీణ్‌గౌడ్‌, గడ్డం చిన్నారెడ్డి, సురేందర్‌, రమేశ్‌, నవీన్‌ పటేల్‌, తహసీల్దార్‌ అనిల్‌, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో కిరణ్‌కుమార్‌, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న ఎంపీ అర్వింద్‌

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ ఎంపీటీసీలు



కండువా వేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఖలీల్‌వాడి: మాక్లూర్‌ మండలానికి చెందిన నలుగురు ఎంపీటీసీలు ఎక్సైజ్‌, పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌ హౌస్‌కు మంత్రి మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాక్లూర్‌ మండలంలోని మదన్‌పల్లి ఎంపీటీసీ ఒడ్డెన్న, గొట్టుముక్కల ఎంపీటీసీ దేగరి సత్తెమ్మ, ఢీకంపల్లి ఎంపీటీసీ కాలగడ్డ దేవన్న ఉన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్‌ ఖేత్‌ అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి, ఆర్మూర్‌ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్‌ నేతలు గంగాధర్‌ గౌడ్‌, కంది శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం కోసమే..

మదన్‌పల్లి ఎంపీటీసీ ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి బీజేపీలో చేరారు. మాక్లూర్‌ ఎంపీపీ కోసం గుత్ప ఎంపీటీసీ, ప్రస్తుత ఎంపీపీ మాస్త ప్రభాకర్‌, మదన్‌పల్లి ఎంపీటీసీ ఒడెన్న పోటీ పడ్డారు. దీంతో నాటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఇద్దరిని రెండున్నరేళ్ల చొప్పున ఎంపీపీ పదవీ చేపట్టాలని స్పష్టం చేశారు. జీవన్‌రెడ్డి ఎన్నికలలో ఓటమి పొందంతో ఒడ్డెన్న అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యాడు. దీంతో అవిశ్వాస తీర్మానం లేటవుతుందని భావించిన ఎంపీటీసీ ఒడ్డెన్న కాంగ్రెస్‌లో చేరారు. రెండు రోజుల్లో మాక్లూర్‌ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ఉంటుందనే ప్రచారం కాంగ్రెస్‌ వర్గాల ద్వారా తెలిసింది.

మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు, అధికారులు



మంత్రితో సురేశ్‌రెడ్డి





పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్‌, కేవీఆర్‌, సుదర్శన్‌రెడ్డి



మంత్రితో కైసర్‌





పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌, జడ్పీ చైర్మన్‌, మేయర్‌



పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి

ఖలీల్‌వాడి/ నిజామాబాద్‌ రూరల్‌: ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఎక్సైజ్‌ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు మంగళవారం స్వాగతం పలికారు. ఆర్‌ అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ చిత్రామిశ్రా, మున్సిపాల్‌ కమిషనర్‌ మకరందు, అదనపు డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్‌, ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ దశరథం, ఎక్సైజ్‌ సూపరిండెంట్‌ మల్లారెడ్డి, ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఏడీ కిషన్‌ తదితరులు పుష్పగుచ్ఛం అందజేశారు.

అర్హులకే ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

ఖలీల్‌వాడి: అర్హులకే ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర క్యాపెనింగ్‌ జాయింట్‌ కన్వీనర్‌ సయ్యద్‌ కైసర్‌ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్‌ నేత సర్దార్‌ నరేందర్‌ సింగ్‌ తదితరులు ఉన్నారు.

మాక్లూర్‌ ఎంపీపీపై అవిశ్వాసానికి తీర్మానం



ఖలీల్‌వాడి: మాక్లూర్‌ ఎంపీపీ మాస్త ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మాన పత్రాన్ని స్థానిక సంస్థల అడిషనల్‌ కలెక్టర్‌ చిత్రా మిశ్రాకు ఎంపీటీసీలు మంగళవారం అందజేశారు. మాక్లూర్‌ మండలంలోని తొమ్మిది మంది ఎంపీటీసీలు తమ సంతకాలతో చేసిన అవిశ్వాస తీర్మాన ప్రతిని అందించారు. మాక్లూర్‌ మండలంలో 14 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఇందులో కాంగ్రెస్‌ పార్టీకి చెందిన తొమ్మిది మంది, ఎంపీపీ మాస్త ప్రభాకర్‌కు ఐదుగురు ఎంపీటీసీలు ఉన్నారు. దీంతో అవిశ్వాసంలో కాంగ్రెస్‌ గెలుపొందే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కార్యక్రమంలో ఆర్మూర్‌ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి ప్రొద్దుటూరి వినయ్‌ కుమార్‌రెడ్డి, మాక్లూర్‌, ఆర్మూర్‌ కాంగ్రెస్‌ నేతలు ఉన్నారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్‌ విజేత కమ్మర్‌పల్లి



కమ్మర్‌పల్లి: మహారాష్ట్రలోని దెగ్లూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌లో కమ్మర్‌పల్లి క్రీడాకారులు విజేతగా నిలిచారు. ఈనెల 24, 25 తేదీల్లో దెగ్లూర్‌లో బ్యాడ్మిండన్‌ పోటీలు నిర్వహించారు. డబుల్స్‌ విభాగంలో కమ్మర్‌పల్లికి చెందిన పెంట కిషన్‌, బద్దం మోహన్‌రెడ్డి జోడి నాందేడ్‌ జట్టుతో ఫైనల్‌లో తలపడగా కమ్మర్‌పల్లి విజేతగా నిలిచింది. విజేతలకు నిర్వాహకులు రూ. 10 వేల నగదుతో పాటు, ట్రోఫీలను అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకులు, కళాశాల ప్రిన్సిపాల్‌, జిల్లా కోఆర్డినేటర్‌ సంగీత మంగళవారం తెలిపారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.లక్షా 50వేల లోపు, పట్టణ విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.2లక్షల లోపు ఉండాలన్నారు. ఫిబ్రవరి 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉంటుందని, విద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్‌

మొరం తరలించిన ట్రాక్టర్లు సీజ్‌



భీమగల్‌: మండలంలోని చేంగల్‌లో అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీని సీజ్‌ చేసినట్లు ఎస్సై హరిబాబు మంగళవారం తెలిపారు. గ్రామంలో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి ట్రాక్టర్లు, జేసీబీని సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా మొరం, ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్‌: మండలంలోని చేపూర్‌ శివారులో పేకాట స్థావరంపై జిల్లా టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడి చేసినట్లు ఎస్సై గంగాధర్‌ మంగళవారం తెలిపారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేయగా వీరి నుంచి రూ.39,270 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా పేకాట ఆడితే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నందిపేట్‌ మండలంలోని షాపూర్‌లో కుల బహిష్కరణ చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు డీసీపీ జయరాం మంగళవారం తెలిపారు. షాపూర్‌కు చెందిన చెందిన నడ్పి గంగాధర్‌ బతుకు దెరువు నిమిత్తం గల్ఫ్‌ దేశానికి వెళ్లి వచ్చాడు. తమకు చెప్పకుండా గంగాధర్‌ తన వ్యవసాయానికి సంబంధించిన కరెంటు మీటర్‌ వేరే వారికి ఇవ్వడంతో సంఘానికి చెందిన ముగ్గురు రూ. లక్ష జరిమానా విధించారు. దీంతో గంగాధర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు గుర్రపు ముత్తెన్న, గుర్రపు రాములు, ఉప్పరి గంగాధార్‌లపై కేసు నమోదు చేసి మొబైల్‌కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

టోల్‌ప్లాజాలో కారును ఢీకొన్న లారీ



ఇందల్వాయి: మండలంలోని టోల్‌ప్లాజాలో ఓ కారును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్సై మహేశ్‌ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా గాంధారికి చెందిన బానోత్‌ ఆనంద్‌ భార్య శారదతో కలిసి కారులో నిజామాబాద్‌ వస్తున్నారు. వీరు ఇందల్వాయి టోల్‌ప్లాజాలో సిబ్బందికి టోల్‌ చెల్లిస్తుండగా అదే వరుసలో వేగంగా వచ్చిన ఓ లారీ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో భార్యభర్తలతో పాటు టోల్‌ప్లాజా సిబ్బంది బాదావత్‌ జైల్‌సింగ్‌కు గాయాలయ్యాయి. లారీ నడిపిన డ్రైవర్‌ సతీశ్‌కుమార్‌ మద్యం మత్తులో ఉన్నాడని ఎస్సై చెప్పారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి



రమేశ్‌ (ఫైల్‌)

బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్‌కు చెందిన తొపారం రమేశ్‌ (45) శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లి మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాస్‌ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రోజులాగే సోమవారం ప్రాజెక్ట్‌లోకి చేపల వేటకు వెళ్లిన రమేశ్‌ సాయంత్రం వరకు తిరిగి ఒడ్డుకు రాలేదు. దీంతో ప్రాజెక్ట్‌లో గాలింపు చర్యలు చేపట్టగా రాత్రి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

బోధన్‌ టౌన్‌: బోధన్‌ పట్టణంలోని అబ్బవ్వ (75) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ వీరయ్య మంగళవారం తెలిపారు. అబ్బవ్వ ఈ నెల 20న మనస్తాపంతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మురికి కాలువలో పడి ఒకరి మృతి



తిరుపతిరావు మృతదేహం

సదాశివనగర్‌: ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని కుప్రియాల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతిరావు కుప్రియాల్‌లో తాపీ మేస్త్రీ పని చేస్తున్నాడు. మద్యం సేవించి ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడడంతో ఊపిరాడక మృతి చెందాడు. మృతుడు కొంత కాలంగా కామారెడ్డి, నిజామాబాద్‌లలో మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తోటి మేస్త్రీ చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు అదుపు తప్పి మరొకరు..

గాంధారి: కారు అదుపు తప్పి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని బుగ్గ గండి ప్రాంతంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బాన్సువాడకు చెందిన మహ్మద్‌ కబీర్‌(35) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్‌ కబీర్‌ మరో ముగ్గురుతో కలిసి శుభకార్య నిమిత్తం కామారెడ్డికి కారులో బయలు దేరారు. బుగ్గ గండి ప్రాంతంలో కారు అదుపుతప్పి పక్కకు పడిపోయింది. దీంతో కారులో ఉన్న మహ్మద్‌ కబీర్‌ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

నీటి గుంతలో పడి బాలుడు..



నర్సింలు మృతదేహం

రాజంపేట: ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సంపత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. దేవునిపల్లికి చెందిన దానబోయిన రాములుకు నలుగురు కుమారులు ఉన్నారు. మంగళవారం సాయంత్రం తమ నివాసానికి దగ్గరలో ఉన్న నీటి గుంతలో స్నానం చేసేందుకు మూడో కుమారుడు నర్సింహులు(15), చిన్న కొడుకు చిన్న నర్సింహులు వెళ్లారు. ప్రమాదవశాత్తు నర్సింహులు నీట మునిగి మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ



ఆలయంలో దొంగలు పగులగొట్టిన హుండీ

బాన్సువాడ రూరల్‌: బోర్లం గ్రామంలో ఉన్న శ్రీఆది బసవేశ్వరాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ పూజారి మఠం బస్వరాజ్‌ మంగళవారం తెలిపారు. రాత్రి పూజ, భజన కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయ గేటుకు తాళం వేసినట్లు తెలిపారు. ఉదయం ఆలయానికి వచ్చేసరికి గర్భగుడిలోని నంది విగ్రహం మెడలో ఉండే 5 తులాల వెండి గొలుసు, హుండీలో ఉన్న నగదును దుండగులు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పూజారి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై సందీప్‌ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బర్ల శ్రీనివాస్‌ కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి నిజామాబాద్‌లో జరిగే ఫంక్షన్‌కు వెళ్లారు. దుండగులు రాత్రి ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. చోరీలో రూ. 40వేల నగదు, రెండు తులాల వెండి చోరీకి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.